

'ఓపెన్'తో ఉన్నత విద్యావకాశాలు
'ఓపెన్' కోర్సులతో ఉన్నత విద్యావకాశాలుంటాయని అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ సీతారామారావు అన్నారు. - 12లో



మట్టపల్లిలో శాంతి కల్యాణం
మట్టపల్లిలోని పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి మహాశాంతి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. - 12లో



విధుల్లోకి తీసుకోవాలి
సస్పెండైన అధికారులను విధుల్లోకి తీసుకోవాలని వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ కృపాకర్‌రెడ్డి కోరారు. - 12లో

న్యూస్‌రీల్

ఓటు హక్కు వినియోగించుకోవాలి

• ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: ఓటర్లు శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నల్లగొండ ఎస్పీ అపూర్వరావు అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఇప్పటి వరకు నల్లగొండ జిల్లాలో రూ.7.39కోట్ల నగదు, రూ.40లక్షల విలువైన మద్యం, రూ.1.71కోట్ల విలువైన గంజాయి, రూ.80లక్షల విలువైన బంగారం పట్టుకున్నట్లు ఆదివారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. కాగా కట్టంగూర్‌లో పలువురు రైతులు రూ.50వేల లోపు పంట రుణం తీసుకొని ఇంటికి వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారని విలేకరులు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా.. ఈ విషయంపై విచారణ చేపడతామని ఆమె తెలిపారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాములు

నకిరేకల్: కల్లు గీత కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొండా వెంకన్న, జిల్లా కార్యదర్శి చొగోని సీతారాములు పిలుపునిచ్చారు. నకిరేకల్‌లోని నర్రా రాఘవరెడ్డి స్మారక భవనంలో ఆదివారం జరిగిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా గీత కార్మికులు అనేక హామీలు ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. కల్లు గీత కార్మిక సంఘానికి 66 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 19 నుంచి 31 జరగనున్న సంఘం వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్, నాయకులు ఉప్పల గోపాల్, కొప్పు అంజయ్యగౌడ్, జెర్రిపోతుల ధనుంజయగౌడ్, భూపతి శ్రీనివాస్, కర్నాటి లక్ష్మయ్య, తండు నర్సింహ, గుడుగుంట్ల బుచ్చిరాములు పాల్గొన్నారు.

17న ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

నల్లగొండ టూటౌన్: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 17న ఉదయం 9గంటలకు నల్లగొండలోని మేకల అభినవ్ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్–19 బాలబాలికల ఉమ్మడి జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డు, 10వ తరగతి మెమో, కాలేజీ బోనఫైడ్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ :9640140183 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బీసీల రిజర్వేషన్‌పై స్పష్టమైన వైఖరి తెలపాలి



మాట్లాడుతున్న పోగుల సైదులు గౌడ్

మిర్యాలగూడ టౌన్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీసీల రిజర్వేషన్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులు గౌడ్ అన్నారు. ఆదివారం మిర్యాలగూడలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు తెలంగాణలో సీట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందని ఆరోపించారు. బీసీలను విస్మరిస్తున్న రాజకీయ పార్టీలకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కర్నాటి శివరామకృష్ణ, మల్లేశ్, నర్సింహ, ఆంజనేయులు ఉన్నారు.

టోల్‌ప్లాజాకు వాహనాల తాకిడి

బీబీనగర్ : మండలంలోని గూడూరు గ్రామ పరిధిలో హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై గల టోల్‌ప్లాజా వద్ద ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. విద్యా సంస్థలకు దసరా సెలవులు ఇవ్వడంతో హైదరాబాద్ జంటనగరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్నవారు స్వగ్రామాలకు వెళ్తున్నారు. దీంతో పాటు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రానికి భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. ఈ క్రమంలో ఉదయం, సాయంత్రం వేళల్లో టోల్‌ప్లాజా వద్ద రద్దీ నెలకొంది. ఒక్కో వాహనం టోల్‌ప్లాజా దాటడానికి అరగంటకు పైగా సమయం పట్టిందని వాహనదారులు తెలిపారు.

హస్తం పార్టీ నుంచి..

ఆరుగురు ఖరారు

• కాంగ్రెస్ ముఖ్య నేతలకు ముందుగా టికెట్లు
• రెండో విడతలో మిగతా వారి పేర్లు
• కమ్యూనిస్టుల సీట్లపై రావాల్సి ఉన్న స్పష్టత
• మునుగోడు, మిర్యాలగూడ సీట్లపై తర్జనభర్జన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఆరు అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారయ్యారు. నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్, హుజూర్‌నగర్, కోదాడ, ఆలేరు నియోజకవర్గాల నుంచి పోటీలో ఉంచే అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఆదివారం ప్రకటించింది. దీంతో కొంత కాలంగా ఆశావహులు, పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు, పార్టీ కేడర్ ఎదురు చూపులకు తెరపడింది. ఇక మిగతా స్థానాల్లో పోటీలో నిలిచే అభ్యర్థులను త్వరలోనే ప్రకటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వెల్లడించింది. మరోవైపు జిల్లాలో కమ్యూనిస్టులకు కేటాయించే స్థానాలపైనా స్పష్టత రావాల్సి ఉంది. కాంగ్రెస్ అధిష్టానం పొత్తులకు సంబంధించిన సీట్ల ఖరారు విషయంలో తర్జనభర్జన పడుతోంది.

ముఖ్య నేతలకు ముందుగానే టికెట్లు..
కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మొదటి జాబితాలో ముఖ్యనేతలకు టికెట్లను కేటాయించింది. సీనియర్ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్ అయిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నల్లగొండ అసెంబ్లీ స్థానం నుంచి టికెట్‌ను ప్రకటించింది. అలాగే మాజీ పీసీసీ అధ్యక్షుడు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హుజూర్‌నగర్, ఆయన సతీమణి పద్మావతిరెడ్డికి కోదాడ టికెట్‌ను కేటాయించింది. మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి తనయుడు జైవీర్‌రెడ్డికి నాగార్జునసాగర్, నకిరేకల్ టికెట్‌ను ఇటీవల పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంకు, ఆలేరు టికెట్‌ను బీర్ల అయిలయ్యకు కేటాయించింది. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 స్థానాల్లో ఆరు స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. త్వరలోనే రెండవ జాబితాలో మిగిలిన ఆరు సీట్లకు అభ్యర్థులను ప్రకటించనున్నారు.

కమ్యూనిస్టుల సీట్లపై రాని స్పష్టత..
పొత్తులో భాగంగా కమ్యూనిస్టులకు కేటాయించే సీట్ల విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో నిమిర్యాలగూడ తమకు ఇవ్వాలని సీపీఎం కోరుతుండగా, మునుగోడు కావాలని సీపీఐ పట్టుపడుతున్నాయి. ఈ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఆశావహుల నుంచి ఒత్తిడి తీవ్రంగానే ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తేలాల్సి ఉంది.

పోటీ ఉన్న చోట బుజ్జగింపులు
టికెట్ కోసం పోటీ ఉన్న చోట బుజ్జగింపుల పర్వానికి తెర తీసింది. గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థులు, ఎన్నికల ఖర్చులను భరించగలిగే స్థోమత కలిగిన వారివైపే మొగ్గు చూపుతోంది. అయితే నియోజకవర్గాల్లో పార్టీ కోసం మొదటి నుంచి పనిచేస్తున్న వారిని పక్కన పెట్టాల్సి వస్తుండడంతో వారిని బుజ్జగించే పనిలో పడింది. భువనగిరి, సూర్యాపేట, తుంగతుర్తి, దేవరకొండ స్థానాల్లోని ఆశావహులతో మాట్లాడుతోంది. ఏకాభిప్రాయం వచ్చాక రెండో జాబితాలో ఆ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించనుంది.

• ఆరోసారి నల్లగొండ బరిలో వెంకట్‌రెడ్డి



భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోసారి నల్లగొండ అసెంబ్లీ బరిలో నిలువబోతున్నారు. 1999, 2004, 2009, 2014 వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, రోశయ్య మంత్రివర్గంలో ఐటీ, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిగా పనిచేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో కూడా మౌలిక వసతులు, పెట్టుబడులు, రేవుల శాఖ మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2018 ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ తరువాత 2019 పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలుపొందారు. ఇప్పుడు నల్లగొండ నుంచి మరోసారి బరిలో ఉండబోతున్నారు.

• హుజూర్‌నగర్ నుంచే ఉత్తమ్



కోదాడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా 1994, 1999, 2004 ఎన్నికల్లో మూడుసార్లు పోటీ చేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 1999, 2004లో గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజన తరువాత హుజూర్‌నగర్ నుంచి 2009, 2014, 2018 ఎన్నికల్లో పోటీ చేసి హ్యాట్రిక్ విజయం సాధించారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీగా విజయం సాధించి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు నాలుగోసారి ఆయన హుజూర్‌నగర్ నుంచి బరిలో దిగబోతున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఉన్నత ఉద్యోగం చేస్తున్న నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి 1994లో తన ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం కిరణ్ కుమార్‌రెడ్డి మంత్రివర్గంలో గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా పని చేశారు.

• కోదాడ నుంచి పద్మావతిరెడ్డి




కోదాడ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా నలమాద పద్మావతిరెడ్డి టికెట్ దక్కించుకున్నారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె కోదాడ నుంచి పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2018లో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నుంచి కోదాడ అభ్యర్థిగా బరిలోకి దిగబోతున్నారు.

• మొదటిసారి జైవీర్‌రెడ్డి, అయిలయ్య



నాగార్జునసాగర్ నుంచి జానారెడ్డి వారసుడిగా కుందూరు జైవీర్‌రెడ్డి మొదటిసారిగా అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగుతున్నారు. 2009 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పని చేస్తున్న ఆయన స్థానిక సంస్థల ఎన్నికల్లో క్రియాశీలకంగా పని చేశారు. ప్రస్తుతం జానారెడ్డి ఆశీస్సులతో అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలువబోతున్నారు. ఇక ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీర్ల అయిలయ్య బరిలో దిగబోతున్నారు. 1991లో ఎన్ఎస్‌యూఐలో చేరిన ఆయన సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవుల్లో పని చేశారు. ప్రస్తుతం టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన మొదటిసారిగా ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు.



• నకిరేకల్‌లో వీరేశం



నకిరేకల్ నియోజకవర్గంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. 2014 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన వేముల వీరేశం ఇప్పుడు అదే నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎన్నికల బరిలో నిలువబోతున్నారు. వీరేశం 2009లో రాజకీయాల్లో అడుగు పెట్టారు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి గెలిచిన వీరేశం ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేయబోతున్నారు. ప్రస్తుతం అక్కడ బీఆర్ఎస్ నుంచి పోటీలో ఉన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య 2009, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచే గెలిచారు. ఆ తరువాత పార్టీ మారిన చిరుమర్తి ఇప్పుడు బీఆర్ఎస్‌నుంచి పోటీలో ఉన్నారు.



కొలువుదీరిన దుర్గామాత

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నల్లగొండలోని బీట్ మార్కెట్ వద్ద రామకోటి ఆలయంలో దుర్గామాతకు ఆదివారం తొలిరోజు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అసెంబ్లీ బరి నుంచి తప్పుకున్న జానారెడ్డి

• సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలు
• రాజకీయ వారసుడిగా కుమారుడు జైవీర్‌కు అవకాశం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా, మంత్రిగా సేవలందించిన కుందూరు జానారెడ్డి ఈసారి అసెంబ్లీ బరినుంచి తప్పుకున్నారు. తన కుమారుడు జైవీర్‌రెడ్డిని ఈసారి పోటీలో దింపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అనుముల గ్రామంలో జన్మించిన ఆయన రాజకీయ ప్రస్థానం 1974లో ప్రారంభమైంది. అప్పట్లో జయప్రకాష్ నారాయణ్ చేపట్టిన సంపూర్ణ క్రాంతి ఉద్యమానికి ఆకర్షితులై 1977లో జనతా పార్టీలో చేరి.. అదేపార్టీ నుంచి 1978లో ప్రత్యక్షంగా ఎన్నికల్లో దిగారు. 55 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇప్పటివరకు అసెంబ్లీకి 11సార్లు పోటీ చేయగా, నాలుగు సార్లు ఓడిపోయిన ఆయన ఏడుసార్లు గెలుపొందారు. అందులో 14 ఏళ్లకు పైగా మంత్రిగా సేవలు అందించారు.

చలకుర్తి నుంచి మొదటిసారిగా పోటీ..
1967లో చలకుర్తి నియోజకవర్గం ఏర్పాటు కాగా 2004 వరకు అదే పేరుతో కొనసాగింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009 నుంచి చలకుర్తిని నాగార్జునసాగర్ నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. జానారెడ్డి 1978లో చలకుర్తి నియోజకవర్గం నుంచి జనతా పార్టీ తరపున తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నిమ్మల రాములు చేతిలో ఓడిపోయారు. 1983 ఎన్నికల్లో జానారెడ్డి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఆ ఎన్నికల్లో నిమ్మల రాములుపై గెలిచి ఆ తరువాత టీడీపీలో చేరారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసిన ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాగ్యానాయక్‌పై గెలిచారు. ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరిన జానారెడ్డి 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయగా, టీడీపీ అభ్యర్థి గోపగాని పెద నర్సయ్యపై గెలుపొందారు. 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గుండెబోయిన రామ్మూర్తి యాదవ్ చేతిలో ఓడిపోయారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో గుండెబోయిన రాంమూర్తి యాదవ్‌పై గెలుపొందారు. 2009 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తేరా చినపరెడ్డిపైనా గెలుపొందారు. 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నోముల నర్సింహయ్యపై గెలుపొందారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసిన నోముల నర్సింహయ్య చేతిలో ఓడిపోయారు. 2021లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ నోముల నర్సింహయ్య కుమారుడు భగత్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈసారి ఎన్నికల్లో జానారెడ్డి తన కుమారుడు జైవీర్‌రెడ్డిని రంగంలోకి దింపారు.

రాష్ట్రంలోనే సీనియర్ మంత్రిగా జానారెడ్డి రికార్డు..
పలు కీలక శాఖల మంత్రి పదవుల్లో కొనసాగిన కుందూరు జానారెడ్డి రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. అత్యధిక కాలం మంత్రిగా (14 ఏళ్ల 11 నెలలు) పని చేశారు. 1988లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పెట్టిన తెలుగుదేశం పార్టీ నుంచి విడిపోయి సొంతంగా తెలుగు మహానాడు పార్టీని స్థాపించారు. ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన జానారెడ్డి హోం, వ్యవసాయ, హౌజింగ్, సహకార, పంచాయతీ రాజ్, రవాణా, రోడ్లు, ఫారెస్ట్, తూనికలు, భవనాలు, గ్రామీణాభివృద్ధి తదితర 13 శాఖలకు మంత్రిగా సేవలందించారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. ఉదయాన్నే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ చేపట్టారు. అనపంతరం ఆరాధన, నిజాభిషేకం, అర్చన చేశారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తరం తదితర పూజలు గావించారు. సాయంత్రం జోడు సేవను ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

తల్లిదండ్రుల త్యాగం ఎనలేనిది



ధరావత్ సంద్యానాయక్‌- పింప్లి దంపతుల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

• రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్: తమ పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తల్లిదండ్రులు చేసే త్యాగం ఎనలేనిదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట మండల పరిధిలోని హనుమతండా ఆవాసం జగ్రామ్ తండాలో సింగరేణి కాలరీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంతులా నాయక్, బీఆర్ఎస్ నాయకుడు కర్ణాకర్ తల్లిదండ్రులు ధరావత్ సంద్యానాయక్‌-పింప్లి విగ్రహాలను మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. ఊరికి దూరంగా అనాగరికంగా ఉండే ఆ రోజుల్లో తమ సంతానానికి విద్యను అందించేందుకు పింప్లి చేసిన కృషిని తెలుసుకొని కొనియాడారు. రోడ్డు సౌకర్యం లేని తండాలో జీవనం సాగిస్తూ కూలీ నాలి చేసుకుంటూనే ప్రభుత్వ పాఠశాల విద్య కోసం తమ పిల్లలను ఎత్తుకొని కిలోమీటర్ల దూరం నడిచి వచ్చిన తీరు మరువలేనిదన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్న వారి ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్ లావుడ్య జీవన్‌లాల్, సింగరేణి డైరెక్టర్ బలరాం నాయక్, సోషల్ వెల్ఫేర్ అడిషనల్ సెక్రటరీ హనుమంతు నాయక్, అడిషనల్ కమిషనర్ ఆఫ్ ఎక్సైజ్ హరికిషన్, జెడ్పీటీసీలు జీడి భిక్షం, సంజీవ్‌నాయక్, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, వంగాల శ్రీనివాస్‌రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దీక్ష శిబిరాన్ని తొలగించిన అధికారులు



టెంట్‌ను తొలగించిన అధికారులు

మునుగోడు: ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ 178 రోజులుగా మునుగోడు మండలంలోని కిష్టాపురం గ్రామంలో చేపడుతున్న రిలే దీక్షల శిబిరాన్ని ఆదివారం అధికారులు తొలగించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దీక్ష చేపట్టవద్దని నాయలకు ఎస్‌ఐ వెంకటేశ్వర్లుతో పాటు అధికారులు సూచించారు. అయినా నాయకులు యథావిధిగా దీక్ష చేపడుతుండడంతో పంచాయతీ సిబ్బంది దీక్ష శిబిరాన్ని తొలగించారు.

బీఆర్‌ఎస్ శంఖారావం

నేడు భువనగిరిలో ప్రజా ఆశీర్వాద సభ

• పాల్గొననున్న సీఎం కేసీఆర్
• ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు
• ఉమ్మడి జిల్లాలో తొలి ఎన్నికల ప్రచార సభ
• 50 వేల మందిని తరలించేందుకు సన్నాహాలు



సభా ప్రాంగణంలో సిద్ధమవుతున్న వేదిక



సాక్షి, యాదాద్రి : బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార సభకు భువనగిరి ముస్తాబైంది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం జనగామలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొంటారు. సాయంత్రం 3 గంటలకు హెలికాప్టర్‌లో భువనగిరిలోని సభాస్థలికి చేరుకొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. వారం రోజులుగా ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. సభ విజయవంతానికి దిశానిర్దేశం చేశారు. దగ్గరుండి సభా ఏర్పాట్లను పరిశీలించారు. భువనగిరి మున్సిపాలిటీ, భువనగిరి మండలం, బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, వలిగొండ మండలాల నుంచి సుమారు 50 వేల మంది తరలించేలా ప్రణాళిక రూపొందించారు. సభలో వేదికపై 100 మంది కూర్చునేలా స్టేజీ ఏర్పాటు చేశారు. మహిళలు, వీఐపీలు, మీడియా, వృద్ధుల కోసం ప్రత్యేక గ్యాలరీలు సిద్ధం చేశారు. హైదరాబాద్ రోడ్డులోని స్పిన్నింగ్ మిల్లులో హెలిపాడ్ ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సభ సందర్భంగా వేదికతోపాటు పట్టణం మొత్తం గులాబీమయంగా మారింది.

మూడుచోట్ల వాహనాల పార్కింగ్
సీఎం సభకు వచ్చే వాహనాలను పార్కింగ్ చేయడానికి మూడు చోట్ల ఏర్పాట్లు చేశారు. రాయగిరి రోడ్డులో ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కళాశాల, గంజ్ మార్కెట్, వలిగొండ రోడ్డు ఖిలా దిగువన వెంచర్, తుర్కపల్లి రోడ్డులో బ్రిడ్జి దాటిన తర్వాత వెంచర్‌ను వాహనాల పార్కింగ్ కోసం కేటాయించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

స్పిన్నింగ్ మిల్ నుంచి కాన్వాయ్
సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో హైదరాబాద్ రోడ్డులో గల పెద్ద చెరువు సమీపంలో స్పిన్నింగ్ మిల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్ ద్వారా సభావేదిక వద్దకు చేరుకుంటారు.

అంచనాలకు మించి జనం..
ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోపై అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందుతున్నాయి. గడిచిన పదేళ్లలో రాష్ట్రం విశేష ప్రగతి సాధించింది. మూడవ సారి కూడా కేసీఆరే ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. భువనగిరిలో జరిగే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో రానున్నారు.
–పైళ్ల శేఖర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే

ఏర్పాట్ల పరిశీలన
డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి సభాస్థలిని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఆదివారం పరిశీలించారు. భద్రతాపరమైన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు చేశారు. సభ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్లు ఉన్నారు.

వరాల జల్లు కురిపించేనా?
ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొనడానికి భువనగిరికి వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ వరాల జల్లు కురిపిస్తారా.. అన్న ఆసక్తితో నియోజకవర్గ ప్రజలు ఉన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నవంబర్ 21న భువనగిరిలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలోనూ కేసీఆర్ పాల్గొన్నారు. ఆసందర్భంగా పలు హామీలు ఇచ్చారు. అందులో భాగంగా 2.65లక్షల ఎకరాలకు సాగునీరు అందించే బస్వాపూర్ రిజర్వాయర్ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అలాగే బునాదిగాని, పిల్లాయపల్లి, ధర్మారెడ్డి కాలువల ఆధునీకరణ పూర్తికాలేదు. పర్యాటక ప్రాంతాలుగా భువనగిరి ఖిలా, బస్వాపురం రిజర్వాయర్లు, మూసీ ప్రక్షాళన హామీలు నెరవేరలేదు.

● బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫారాలు











హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ బీఫారాలు అందుకుంటున్న విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి (సూర్యాపేట), గాదరి కిషోర్‌కుమార్ (తుంగతుర్తి), పైళ్ల శేఖర్‌రెడ్డి (భువనగిరి), రమావత్ రవీంద్రకుమార్ (దేవరకొండ), బొల్లం మల్లయ్యయాదవ్ (కోదాడ), నోముల భగత్ (నాగార్జునసాగర్), కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి (మునుగోడు), చిరుమర్తి లింగయ్య (నకిరేకల్), కంచర్ల భూపాల్‌రెడ్డి (నల్లగొండ)

అడవి నుంచి అసెంబ్లీ దాకా..

- జనశక్తి రాష్ట్ర కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వర్తించిన వీరేశం
- కొన్నాళ్లు జైలు శిక్ష.. ఆ తర్వాత అజ్ఞాతంలోకి..
- 2009లో టీఆర్‌ఎస్‌లో చేరి 2014లో ఎమ్మెల్యేగా విజయం
- 2018లో ఓటమి.. ఈసారి కాంగ్రెస్ నుంచి బరిలోకి..




నకిరేకల్ : అడవిబాట పట్టి ఆ తర్వాత జనజీవన స్రవంతిలో కలిసి నకిరేకల్ నియోజకవర్గం నుంచి 2014 ఎమ్మెల్యేగా గెలిచారు వేముల వీరేశం. తదనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఆయన ఈ ఎన్నికల్లో నకిరేకల్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నారు.

కుటుంబ నేపథ్యం..

తుంగతుర్తి నియోజకవర్గం శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన వేముల వీరేశం సీపీఐ(ఎంఎల్) నేత యానాల మల్లారెడ్డి స్ఫూర్తితో ప్రగతిశీల ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరకు ఎదిగారు. తర్వాత సీపీఐ(ఎంఎల్) జనశక్తి విప్లవ ఉద్యమంలోకి అడుగుపెట్టాడు. 2004లో ప్రభుత్వ చర్చల సమయంలో జనశక్తి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న వేముల వీరేశం 2005 ఆగస్టులో విజయవాడలో అరెస్టయి కొంతకాలం జైలు శిక్ష అనుభవించారు. జైలు నుంచి విడుదలైన అనంతరం వీరేశంపై పోలీసులు అక్రమ కేసులు మోపే ప్రయత్నం చేయగా అజ్ఞాతంలోకి వెళ్లాడు. 2007లో సీపీఐ(ఎంఎల్) జనశక్తి రాష్ట్ర కార్యదర్శి అమర్ అరెస్టు అనంతరం ఆయన బాధ్యతలను వేముల వీరేశం చేపట్టారు. అప్పటి నుంచి 2009 జూలై వరకు వీరేశం అజ్ఞాతంలోనే ఉన్నారు.

2009లో టీఆర్‌ఎస్‌లో చేరిక..

పోలీసుల నుంచి విముక్తి పొందిన వేముల వీరేశం నకిరేకల్‌లో ఉంటూ కోర్టు కేసుల చుట్టూ తిరుగుతూనే 2009లో గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆశీస్సులతో టీఆర్‌ఎస్‌లో చేరారు. 2013లో టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు.

2014 ఎన్నికల్లో విజయం

తెలంగాణ ఏర్పాటు అనంతరం 2014 సార్వత్రిక ఎన్నికల్లో నకిరేకల్ నుంచి టీఆర్‌ఎస్ టికెట్ దక్కించుకున్న వేముల వీరేశం కాంగ్రెస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్యపై విజయం సాధించారు. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య చేతిలో ఓటమి పాలయ్యారు.

ఎన్‌కౌంటర్ పేరుతో చంపే ప్రయత్నం

నాటి సీమాంధ్ర పాలకులు ప్రజా ఉద్యమంపై ఉక్కుపాదం మోపి వేముల వీరేశాన్ని ఎన్‌కౌంటర్ పేరుతో చంపే ప్రయత్నం చేశారు. సుదీర్ఘ కాలంగా విద్యార్థి, విప్లవ ఉద్యమంలో వీరేశం పనిచేసిన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రజా సంఘాలతో సత్సంబంధాలు పెట్టుకొని క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. వ్యవస్థ మారాలని, ప్రజల సమస్యలు తీరాలనే లక్ష్యంతో ఉద్యమాలు నడిపారు. అజ్ఞాతంలో ఉన్న వీరేశంను 2009 జూలై 2వ తేదీన హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా అరెస్టు చేసి చిత్రహింసలకు గురి చేశారు. వీరేశానికి కూతురు, కుమారుడు ఉన్నారు. వీరేశం భార్య పుష్ప కూడా కళాకారురాలిగా అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రతినిధిగా పని చేశారు.

ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

- రాచకొండ పరిధిలో 25 చెక్ పోస్టులు ఏర్పాటు
- రూ.25 కోట్లు స్వాధీనం

భువనగిరి రూరల్, మోత్కూరు, ఆత్మకూర్(ఎం) : అసెంబ్లీ ఎన్నికలను కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఆదివారం ఆయన భువనగిరి శివారులోని అరోరా ఇంజనీరింగ్ కాలేజీలోని డీఆర్‌సీ కేంద్రాన్ని డీసీపీ రాజేశ్‌చంద్రతో కలిసి సందర్శించారు. స్ట్రాంగ్‌రూంలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, భద్రతా చర్యలను పరిశీలించారు. అనంతరం మోత్కూరు, ఆత్మకూరు(ఎం) పోలీస్‌స్టేషన్లను సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం, డబ్బు తరలించకుండా రాచకొండ కమిషనరేట్ పరిధిలో 25 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేశాక రూ.7 కోట్లు, అంతకుముందు రూ.18 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శాంతిభద్రతలు, మహిళా సురక్ష, చైన్ స్నాచింగ్, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు తదితర వాటిపై నిరంతర నిఘా కొనసాగుతుందన్నారు. ఎన్నికల విధులకు సంబంధించి క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించే సిబ్బందికి అవగాహన కల్పించేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.


భువనగిరిలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్, డీసీపీ రాజేశ్‌చంద్ర

రూ.50వేల వరకే అనుమతి

ఎన్నికల నిబంధనల ప్రకారం రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాని సీపీ తెలిపారు. అంతకుమించి నగదు తీసుకెళ్లినట్లయితే ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు. ఆయన వెంట చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరామ్, మోత్కూరు, ఆత్మకూరు(ఎం) ఎస్‌ఐలు ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

హ్యాట్రిక్ వీరులు వీరే..

ఏడు సార్లు విజయం సాధించిన జానారెడ్డి

ఆరుసార్లు గెలిచిన నర్రా రాఘవరెడ్డి

- వరుసగా ఐదుసార్లు గెలిచిన మోత్కుపల్లి నర్సింహులు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పార్టీ టికెట్ ఇవ్వకపోయినా ఇండిపెండెంట్లుగా గెలిచిన దామోదర్‌రెడ్డి, నర్సింహులు


జానారెడ్డి


నర్రా రాఘవరెడ్డి


నర్సింహులు


యాదగిరిరెడ్డి


మాధవరెడ్డి


వెంకట్‌రెడ్డి


గోవర్ధన్‌రెడ్డి


ఉమామాధవరెడ్డి


తిప్పన కృష్ణారెడ్డి


నారాయణరావు


ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


చందర్‌రావు


దామోదర్‌రెడ్డి

కోదాడ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలువురు నేతలు ఒకే నియోజకవర్గం నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ వీరులుగా నిలిచారు. కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి డబుల్ హ్యాట్రిక్ సాధించగా, సీపీఎం సీనియర్ నాయకుడు నర్రా రాఘవరెడ్డి డబుల్ హ్యాట్రిక్‌ను తృటిలో మిస్ అయ్యారు. మరి కొందరు నాలుగుసార్లు, ఐదు సార్లు కూడా విజయం సాధించి ఆయా నియోజకవర్గాల్లో తమకున్న పట్టును నిలుపుకున్నారు. ఒక్కసారి ఈ హ్యాట్రిక్ వీరులను పరిశీలిస్తే...

దేవరకొండలో బద్దుచౌహాన్

ఎస్టీ రిజర్వుడ్ నియోజకవర్గమైన దేవరకొండలో సీపీఐ నుంచి పోటీ చేసిన ఎం.బద్దుచౌహాన్ వరుసగా మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ వీరుడిగా నిలిచారు. ఈయన 1985లో కాంగ్రెస్ అభ్యర్థి బి.విజయలక్ష్మిపై, 1989, 1994లో కాంగ్రెస్ అభ్యర్థి రాగ్యా నాయక్‌పై విజయం సాధించారు.

కోదాడలో వేనేపల్లి.. హుజూర్‌నగర్‌లో ఉత్తమ్

ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్న కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో ఇద్దరు హ్యాట్రిక్ సాధించారు. వీరిలో ఒకరు కోదాడలోనే హ్యాట్రిక్ సాధించగా, మరొకరు కోదాడలో రెండుసార్లు గెలిచిన తరువాత హుజూర్‌నగర్‌కు మారి అక్కడ మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ కొట్టారు. కోదాడ నుంచి వేనేపల్లి చందర్‌రావు 1985, 1989, 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థిగా ఎస్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి 1999, 2004 ఎన్నికల్లో కోదాడ నుంచి విజయం సాధించారు. 2009లో ఆయన హుజూర్‌నగర్ నియోజకవర్గానికి మారారు. అక్కడి నుంచి 2009, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. ఆ తరువాత 2019లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నల్లగొండ ఎంపీగా గెలుపొందారు. ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల్లో కలిపి ఆయన వరుసగా ఆరు సార్లు విజయం సాధించారు.

నల్లగొండలో నాలుగుసార్లు గెలిచిన కోమటిరెడ్డి

జిల్లా కేంద్రమైన నల్లగొండ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించిన ఆయన 2018 ఎన్నికల్లో మాత్రం పరాజయం పాలయ్యారు.

మునుగోడులో ఇద్దరు..

మునుగోడు నియోజకవర్గం నుంచి ఇద్దరు నేతలు వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి 1967, 1972, 1978, 1983 ఎన్నికల్లో వరుసగా నాలుగుసార్లు విజయం సాధించారు. 1999 ఎన్నికల్లో కూడా విజయం సాధించారు. ఇదే నియోజకవర్గం నుంచి సీపీఐ నాయకుడు ఉజ్జిని నారాయణరావు 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు.

తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డి..

మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తుంగతుర్తి నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు, సూర్యాపేట నుంచి ఒకసారి విజయం సాధించారు. 1985, 1989 కాంగ్రెస్ అభ్యర్థిగా, 1994లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసి వరుసగా మూడుసార్లు విజయం సాధించారు. 1999లో ఓటమి పాలైన ఆయన 2004లో మరోసారి అక్కడి నుంచే గెలుపొందారు. 2009లో సూర్యాపేట నుంచి పోటీ చేసి గెలుపొందారు.

డబుల్ హ్యాట్రిక్ తృటిలో మిస్సైన నర్రా..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నకిరేకల్ నియోజకవర్గం నుంచి నర్రా రాఘవరెడ్డి సీపీఎం నుంచి బరిలో నిలిచి ఏడు విడతల్లో ఆరు సార్లు గెలుపొందారు. కానీ ఆయన డబుల్ హ్యాట్రిక్ మాత్రం మిస్ అయ్యారు. 1967లో ఆయన నకిరేకల్‌లో తొలిసారి సీపీఎం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి మూసాపేట కమలమ్మపై విజయం సాధించారు. 1972లో జరిగిన ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి కమలమ్మ చేతిలో పరాజయం పాలయ్యారు. ఆ తరువాత 1978లో కాంగ్రెస్ అభ్యర్థి నర్సయ్యపై, 1983లో ఎస్.ఇంద్రసేనారెడ్డిపై, 1895 డి.చినవెంకట్రాములుపై, 1989 గుర్రం విద్యాసాగర్‌రెడ్డిపై, 1994లో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన నేతి విద్యాసాగర్‌పై నర్రా విజయం సాధించారు.

డబుల్ హ్యాట్రిక్ వీరుడు జానా

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి నాటి చలకుర్తి, ప్రస్తుత సాగర్ నియోజకవర్గాల ఏడుసార్లు విజయం సాధించారు. ఈ విజయాల్లో డబుల్ హ్యాట్రిక్ ఉండడం విశేషం. ఉపాధ్యాయుడిగా పని చేసిన ఈయన 1978లో జనతాపార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 1983లో ఇండిపెండెంట్‌గా గెలిచారు. 1985 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచారు. కాంగ్రెస్ తరఫున 1989 గెలిచారు. 1994 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 1999, 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. 2009లో సాగర్ నియోజకవర్గం ఏర్పడింది. 2009, 2014 ఎన్నికల్లో సాగర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా జానారెడ్డి విజయం సాధించారు. 2018 సాధారణ.. 2021 ఉప ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు.

రామన్నపేటలో ఇద్దరు..

గతంలో ఉండి ప్రస్తుతం రద్దయిన రామన్నపేట నియోజకవర్గం నుంచి ఇద్దరు నాయకులు వరసగా మూడేసిసార్లు విజయం సాధించి హ్యాట్రిక్ వీరులుగా నిలిచారు. ఈ నియోజకవర్గం నుంచి 1952, 1957, 1962 ఎన్నికల్లో పీడీఎఫ్ నుంచి పోటీ చేసిన కె.రామచంద్రారెడ్డి వరుసగా విజయం సాధించారు. ఆ తరువాత గుర్రం యాదగిరిరెడ్డి ఇదే నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసి 1985, 1989, 1994 ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టారు.

మిర్యాలగూడలో 'తిప్పన'

సాగర్ ఆయకట్టులో ఉన్న మిర్యాలగూడెం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన తిప్పన చినకృష్ణారెడ్డి 1962, 1967, 1972 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసిన జూలకంటి రంగారెడ్డి 1994, 2004, 2009 ఎన్నికల్లో గెలిచినా మధ్యలో 1999 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రేపాల శ్రీనివాస చేతిలో ఓడిపోయి హ్యాట్రిక్ మిస్ అయ్యారు.

హ్యాట్రిక్ కొట్టిన భార్యాభర్తలు

భువనగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ తరుపున పోటీ చేసిన మాజీ మంత్రి దివంగత ఎలిమినేటి మాధవరెడ్డి, ఆయన భార్య మాజీ మంత్రి ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి వరుస విజయాలతో హ్యాట్రిక్ కొట్టారు. 1985, 1989, 1994, 1999 ఎన్నికల్లో మాధవరెడ్డి విజయం సాధించగా.. ఉమా మాధవరెడ్డి 2000లో ఉప ఎన్నికల్లో, 2004, 2009 సాధారణ ఎన్నికల్లో గెలిపొంది హ్యాట్రిక్ కొట్టారు.

వరుసగా ఐదుసార్లు గెలిచిన మోత్కుపల్లి

ఆలేరు నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు వరుసగా విజయాలు సాధించారు. టీడీపీ నుంచి మూడుసార్లు, ఇండిపెండెంట్‌గా ఒకసారి, కాంగ్రెస్ పార్టీ నుంచి మరోసారి ఆయన గెలుపొందారు. 1983, 1985 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలుపొందిన మోత్కుపల్లి 1989లో ఇండిపెండెంట్‌గా నిలబడి గెలుపొందారు. 1994లో టీడీపీ నుంచి 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు.

కాంగ్రెస్ అభ్యర్థుల బయోడేటా

● హుజూర్‌నగర్ : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

తల్లిదండ్రులు : నలమాద ఉషాదేవి, పురుషోత్తమరెడ్డి
పుట్టిన తేదీ : 20-06-1962
విద్యార్హత : బీఎస్సీ, నేషనల్ డిఫెన్స్ అకాడమీ, కమర్షియల్ పైలెట్
వివాహం : 1 ఏప్రిల్ 1991
భార్య : పద్మావతి రెడ్డి, లింగంపేట్ గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా
రాజకీయ ప్రవేశం : 1994లో కాంగ్రెస్ పార్టీలో చేరిక

● నల్లగొండ అభ్యర్థి : కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జననం : 23-05-1963
స్వస్థలం : బ్రాహ్మణవెల్లెంల, నార్కట్‌పల్లి మండలం, నల్లగొండ జిల్లా
తల్లిదండ్రులు : పాపిరెడ్డి, సుశీలమ్మ
కుటుంబం : భార్య సబిత కుమార్తె శ్రీనిధి, కుమారుడు ప్రతీక్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు.
విద్యార్హత : ఇంజనీరింగ్

● నాగార్జునసాగర్ : కుందూరు జైవీర్‌రెడ్డి

తల్లిదండ్రులు : కుందూరు జానారెడ్డి, సుమతి
కుటుంబం : భార్య భవానీ అనుశ్రీ, కుమారులు రణదేవ్, శివ్
పుట్టిన తేదీ : 08-10-1982
విద్యార్హతలు : బీఈ మెకానికల్ ఇంజనీరింగ్, ఎంఎస్ (న్యూయార్క్)
స్వస్థలం : అనుముల
రాజకీయ నేపథ్యం : 2009 నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా పని చేస్తున్నారు.

● కోదాడ అభ్యర్థి : నలమాద పద్మావతిరెడ్డి

వయస్సు : 49 సంవత్సరాలు
తల్లిదండ్రులు : ధనుంజయరెడ్డి- ఉమాదేవి
స్వస్థలం : లింగంపేట గ్రామం, జడ్చర్ల మండలం, మహబూబ్‌నగర్ జిల్లా
భర్త : నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
విద్యార్హతలు : బీఈ (ఆర్కిటెక్చర్)
వృత్తి : ఇంటీరియర్ డిజైనర్

● నకిరేకల్ అభ్యర్థి : వేముల వీరేశం

తల్లి, తండ్రి : మల్లమ్మ, కొండయ్య(లేట్)
పుట్టిన తేదీ : 01-06-1977
విద్యార్హతలు : ఎంఏ (ఓపెన్)
వృత్తి : వ్యవసాయం
స్వగ్రామం : ఊట్కూర్ శాలిగౌరారం మండలం
కుటుంబం : భార్య పుష్పలత, కుమారుడు విపుల్‌కుమార్, కుమార్తె వినూత్న

● ఆలేరు అభ్యర్థి : బీర్ల అయిలయ్య

స్వస్థలం : సైదాపురం, యాదగిరిగుట్ట మండలం
తల్లిదండ్రులు : బీర్ల బుచ్చమ్మ, సోమరాజు
భార్య : అనిత
పిల్లలు : కుమార్తెలు అరుంధతి, శృతి, కుమారుడు శివమణి
చదువు : బీఏ
వృత్తి : బిజినెస్
రాజకీయం : 1991లో ఎన్ఎస్‌యూఐలో చేరారు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ట్రావెల్స్ బస్సు బోల్తా

మిర్యాలగూడ టౌన్: విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి ప్రైవేట్ ట్రావెల్స్ బోల్తా కొట్టింది. ఈ ఘటన మిర్యాలగూడ మండలం గూడూరు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు.. హైదరాబాద్ నుంచి శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు ఒంగోలుకు వెళ్తోంది. డ్రైవర్ నిద్ర మత్తులోకి జారుకోవడంతో ఆదివారం తెల్లవారుజామున బస్సు మిర్యాలగూడ మండలం గూడూరు సమీపంలోని ఆటోనగర్ వద్దకు రాగానే అద్దంకి-నార్కట్‌పల్లి హైవే పక్కన 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. బస్సులో 50మంది ప్రయాణికులు ఉండగా.. వారికి ఎలాంటి గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాణికులను ఇతర బస్సుల్లో ఆంధ్రప్రదేశ్‌కు పంపించారు. కాగా ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్ఐ తెలిపారు.

ప్రాణం తీసిన అతివేగం

- కారులో వెళ్తూ చెట్టును ఢీకొట్టి చింతపల్లి మండలం వింజమూరువాసి మృతి
- రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో ఘటన
- మూడు రోజుల కిందటే లండన్ నుంచి వచ్చిన మృతుడు

యాచారం: అతివేగం ఓ యువ ఇంజనీర్ ప్రాణాలు బలిగొంది. యాచారం సీఐ సైదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూరు గ్రామానికి చెందిన ఎండీ అమినుద్దీన్, గౌసియాబేగం దంపతుల మూడో కుమారుడు రఫీక్ (25) లండన్‌లో ఎంఎస్ చదువుతున్నాడు. మూడు రోజుల క్రితం రఫీక్ హైదరాబాద్‌కు వచ్చాడు. చింతపల్లి మండల కేంద్రం సమీపంలో దర్గా వద్ద వారి బంధువులు ఏర్పాటు చేసిన విందుకు హాజరవ్వాలని ఆదివారం కారులో స్వగ్రామానికి బయలుదేరాడు. అతివేగంగా వెళ్తున్న కారు రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని తుమ్మలోనిగూడ గేట్‌వద్ద నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. రఫీక్ కారులోనే ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానిక పోలీసులు మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కనగల్‌లో రూ.9,77,000 పట్టివేత

కనగల్: వాహనాల తనిఖీల్లో భాగంగా ఆదివారం కనగల్ మండల కేంద్రంలో ఎనిమిది మంది నుంచి రూ.9,77,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి పేర్కొన్నారు. ఆధారాలు చూపని కారణంగా నగదును సీజ్ చేసి నల్లగొండ డీసీసీ(జిల్లా ట్రెజరీ)లో డిపాజిట్ చేసినట్లు పేర్కొన్నారు.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద రూ.4.62లక్షలు..

చౌటుప్పల్: మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు 4.62లక్షల నగదును పట్టుకున్నారు. హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కారులో 2.50లక్షలు, మరో కారులో 2.12 లక్షలు స్వాధీనం చేసుకున్నామని సీఐ ఎస్. దేవేందర్ తెలిపారు.

మర్రిగూడలో రూ.6లక్షలు..

మర్రిగూడ: గుర్రంపోడు, కనగల్ మండలాలకు చెందిన మండల్ వెంకన్న, కిలారి రామలింగయ్య బొలేరో వాహనంలో తీసుకెళ్తున్న రూ.6లక్షలను మర్రిగూడ మండలంలోని సరంపేట క్రాస్‌రోడ్డు వద్ద పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ రంగారెడ్డి తెలిపారు.

ఆరు గ్యారంటీ స్కీంలతో అధికారం ఖాయం


మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కసిరెడ్డి నారాయణరెడ్డి

భూదాన్‌పోచంపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలతో రాష్ట్రంలో అధికారంలోకి రాబోతున్నామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జెడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్‌తో కలిసి భూదాన్ పోచంపల్లి మండలంలోని పెద్దరావులపల్లి, పెద్దగూడెం గ్రామాల్లో ఆరు గ్యారంటీ స్కీంలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ చేస్తామన్నారు. ఆయా గ్రామాల్లో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సామ మధుసూదన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, ఎంపీటీసీ బుచ్చయ్య, నాయకులు సామ మోహన్‌రెడ్డి, అంబరీష్‌రెడ్డి, అనిరెడ్డి జగన్‌రెడ్డి, కాసుల అంజయ్య, భూపాల్‌రెడ్డి, పక్కీరు నర్సిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు నోముల మమత బస్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఇంట్లో మూడుసార్లు చోరీ

- జల్సాలకు అలవాటు పడి దొంగతనం
- నాలుగు నెలల తర్వాత పట్టుబడిన ఐదుగురు నిందితులు
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి


వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి

మిర్యాలగూడ టౌన్: జల్సాలకు అలవాటు పడి ఒకే ఇంట్లో మూడుసార్లు చోరీకి పాల్పడిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆదివారం మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ వెంకటగిరి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అవంతీపురం గ్రామానికి చెందిన వెంకట్రావు-జ్యోతి దంపతులు ఐదు నెలల క్రితం అమెరికాలో ఉంటున్న తమ కుమారుడి వద్దకు వెళ్లారు. వారి ఇంట్లో ఎలాంటి కదలికలు లేకపోవడం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు మే నెలలో వారి ఇంట్లోకి చొరబడ్డారు కానీ ఎలాంటి వస్తువులను ముట్టుకోలేదు. ఆ తర్వాత జూన్ నెల చివరి వారంలో మరోసారి ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి బీరువాను కట్టర్‌తో కట్ చేశారు కానీ ఎలాంటి వస్తువులను కూడా తీసుకెళ్లలేదు. మూడోసారి 2023 జూలై 10న అర్ధరాత్రి టాటా ఏస్ వాహనాన్ని తీసుకొచ్చి ఇంట్లో ఉన్న రెండు ఫ్రిడ్జిలు, రెండు ఇన్వర్టర్లు, నాలుగు గ్యాస్ సిలిండర్లు, రెండు వెండి కుందులు, గ్యాస్ స్టౌవ్, వాషింగ్ మిషన్, ఓవెన్, గీజర్, నాలుగు పట్టు చీరలు, రెండు సెల్ ఫోన్లను ఎత్తుకెళ్లారు. చోరీ జరిగిన విషయం తెలుసుకున్న వెంకట్రావు బంధువులు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు. కాగా మిర్యాలగూడ మండలంలోని ఆలగడప టోల్ ప్లాజా చెక్‌పోస్టు వద్ద ఆదివారం పోలీసులు క్యారియర్ గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా అందులో వెంకట్రావు ఇంట్లో చోరీ చేసిన వస్తువులు కనిపించాయి. దీంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురితో పాటు వారికి సంబంధించిన మరో వ్యక్తి బైక్‌పై వస్తుండగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. వారిని విచారించగా చోరీ పాల్పడింది తామేనని నిజం ఒప్పుకున్నారని పేర్కొన్నారు.

చెడు వ్యసనాలకు అలవాటుపడి..

పట్టుబడిన నిందితుల్లో మిర్యాలగూడ మండలం గోగువారిగూడేనికి చెందిన నర్సింగ్ గంగాధర్, మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన కుంచం ప్రశాంత్, మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గ్రామానికి చెందిన పట్టేటి హేమంత్‌కుమార్, ఈర్ల మల్లేష్, ఆలగడప గ్రామానికి చెందిన పాతకోటి బుచ్చిబాబు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరందరూ స్నేహితులని, మద్యానికి బానిసలై, జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కేసును ఛేదించిన ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు, కానిస్టుబుల్ శ్రీనివాస్‌ను డీఎస్పీ, సీఐ సత్యనారాయణ అభినందించారు.